- 'పది', ఇంటర్ ఫలితాల్లో జిల్లాను ప్రథమస్థానంలో నిలువాలి
- జనవరి నుంచి స్పెషల్ తరగతులు నిర్వహించాలి
- మెదక్ కలెక్టర్ రాజర్షి షా

# వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాజర్షిషా

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 21 : పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేస్తూ వెనకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని మెదక్ కలెక్టర్ రాజర్షి షా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎఫ్ఎల్, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'లక్ష్య' కార్యక్రమంలో నిర్ధేశించిన కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని సూచించారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, చదువు పట్ల ఆసక్తి పెంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జనవరి నుంచి ఉదయం, సాయంత్రం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థులు రోజూ పాఠశాలకు హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. పోషకుల సమావేశాలు నిర్వహించి విద్యార్థుల ప్రగతి గురించి చర్చించాలని సూచించారు. ఉన్నతి, తొలిమెట్టు కార్యక్రమాలపై అమలుపై మండల విద్యాధికారు, నోడల్ అదికారులు, సీపీడీ టీమ్ సభ్యులతో చర్చించి క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలయ్యేలా పలు సూచనలు చేశారు. విద్యార్థులతో అభ్యసన సామర్థ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండ విద్యాధికారులు, నోడల్ అధికారులు తమ పరిశీలన అంశాలను తప్పకుండా తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమాలు అమలుపై జనవరి మొదటి వారంలో మరోకసారి సమీక్ష సమావేశం నిర్వహిస్తామని కలెక్టర్ వెల్లడించారు.

### ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపాలని మెదక్ కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ, జూనియర్ కళాశాలల అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులు సెల్ ఫోన్, సోషల్ మీడియాలకు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లాలో అన్ని కళాశాలల ఈ నెల 28న అధ్యాపకులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలన్నారు. విద్యార్థులు ఏ,బీ,సీ, డీలుగా విభజించాలన్నారు. సమావేశాలకు సీ,డీ గ్రూపు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జనవరి 1 నుంచి విద్యార్థులకు స్పెషల్ స్టడీ అవర్స్, స్పెషల్ స్లిప్ టెస్టులు నిర్వహించాలన్నారు. ఈ నెల చివరి వరకు సిలబస్ పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశాల్లో అదనపు వెంకటేశ్వర్లు, రమేశ్, జిల్లా విద్యాధికారులు రమేశ్, రాధాకిషన్, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్‌మూర్తి, మండల విద్యాధికారులు, నోడల్ అధికారులు, జిల్లా ప్యానల్ సపోర్టింగ్ టీమ్ ప్రధానోపాధ్యాయులు, సీపీడీ టీమ్ సభ్యులు, సీఎస్ఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.


పాల్గొన్న అధికారులు


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

# మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి

**హుస్నాబాద్ మోడల్ స్కూల్‌ను సందర్శించిన సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్**

హుస్నాబాద్, డిసెంబర్ 21: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ అన్నారు. పట్టణంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదనే విషయంపై ఫిర్యాదులు రాగా, ఈ విషయాన్ని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గురువారం జిల్లా మోడల్ పాఠశాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. వంట సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం ఎందుకు పెట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్ అన్నపూర్ణకు సూచించారు. పాఠశాలలో ఏదైనా ఘటనలు జరిగితే వెంటనే విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తరచూ పాఠశాలను పర్యవేక్షణ చేయాలని డీఈవోకు సూచించారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు పట్టణంలో మెడికల్ కళాశాల ఏర్పాటు, ఆర్టీఏ కార్యాలయాల నిర్మాణం కోసం స్థలాన్ని అన్వేషణ చేయాలని తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి నివసించేలా ఏర్పాట్లు చేయాలని, మంత్రి నివా సం చుట్టూ ఉన్న ప్రభుత్వ స్థలాల విచారణ చేపట్టి ప్రహరీ నిర్మించాలని సూచించారు.

# రేపటి నుంచి గరికపాటి ప్రవచనాలు

**వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన ఉత్సవ కమిటీ**


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 21 : సిద్దిపేట ధార్మిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 25 వరకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో చాణ్యక నీతి శాస్త్రంపై ప్రముఖ ప్రవచన కర్త, డాక్టర్ గరికపాటి నరసింహారావు ప్రవచనాలు వినిపిస్తారని ఉత్సవ కమిటీ బాధ్యులు గ్యాదరి పరమేశ్వర్, తిప్పరాజు మధుసూదన్, రమేశ్ తెలిపారు. గురువారం ప్రవచనాల వాల్‌పోస్టర్‌ను స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో యువత పెడదారిన పడుతున్నారని, ఇలాంటి గొప్ప కార్యక్రమాలతో అందరిలో మార్పువస్తుందన్నారు. సిద్దిపేటలో గరికపాటి ప్రవచనాలు రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 8 వరకు ఉంటాయని చెప్పారు. కార్యక్రమం అనంతరం అల్పాహారం ఉంటుందన్నారు. ఇది వరకు అమర్నాథ్ అన్నదాన సమితి ద్వారా మంచులింగం ప్రదర్శనకు పెట్టామన్నారు. అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా అమర్నాథ్ అన్నదాన ట్రస్ట్ ద్వారా 40 రోజుల పాటుగా అన్నదానం నిర్వహిస్తామన్నారు.

# సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏ ప్లస్ గ్రేడ్

- రాష్ట్రంలో రెండో కళాశాలగా గుర్తింపు
- కళాశాలలో మిన్నంటిన సంబురాలు

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 21 : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మారో అరుదైన ఘనతను సాధించింది. ఇంతవరకు ఏగ్రేడ్‌గా ఉన్న స్వయం ప్రతిపత్తి కలిగిన కళాశాల ఏ-ప్లస్ గ్రేడ్‌ను కైవసం చేసుకొని రాష్ట్రంలో రెండో కళాశాలగా తన ప్రత్యేతను చాటుకుంది. ఇటీవల ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నాల్గో న్యాక్ ఇయర్ టీం సందర్శించింది. కళాశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, మౌలిక వసతుల కల్పన పరిశోధన పద్ధతులు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర విభాగాలను ప్రత్యేకంగా పరిశీలించి కళాశాలకు 7 క్రైటీరియా వైజ్‌గా మార్కులు కేటాయించి ఏ ప్లస్ గ్రేడ్‌ను గురువారం ప్రకటించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ.. సిద్దిపేట డిగ్రీ కళాశాల 3.14తో ఏ గ్రేడ్‌గా ఉండేదని, ఇప్పుడు 3.5తో ఏ ప్లస్ గ్రేడ్‌ను కైవసం చేసుకుందని సంతోషం వ్యక్తం చేశారు. అందరి సమష్టి కృషితో ఏ గ్రేడ్‌ను సాధించామని అధ్యాపకులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అంతకు ముందు కళాశాల ఆవరణలో విద్యార్థులు పటాకాలు కాల్చి సంబురాలు నిర్వహించారు.



కళాశాల ఏ ప్లస్ గ్రేడ్ సాధించడంతో విజయ సంకేతాన్ని చూపుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

# ఉచిత బస్సులతో ఉపాధి కోల్పోతున్నాం

**మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఆందోళన చేపట్టిన ఆటోడ్రైవర్లు**

హత్నూర, డిసెంబర్ 21 : ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో తాము ఉపాధి కోల్పోతున్నామని హత్నూర మండలం దౌల్తాబాద్ చౌరస్తావద్ద ఆటోడ్రైవర్లు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆటోడ్రైవర్ల ఉపాధిపై దెబ్బకొట్టడం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. స్వయం ఉపాధికోసం అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసి జీవనోపాధి పొందుతుంటే, ప్రభుత్వం తమ బతుకుదెరువులపై దెబ్బకొట్టిందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటోలకు గిరాకీ దొరకడం లేదన్నారు. దీంతో ఓవైపు ఫైనాన్స్ డబ్బులు చెల్లించలేక, అప్పులు కట్టలేక మరోవైపు కుటుంబపోషణ భారమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి ఆటోడ్రైవర్లకు నెలనెలా జీవనభృతి చెల్లించాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతంచేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మోటర్ ట్రాన్స్‌ఫోర్ట్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, ఆటోయూనియన్ అధ్యక్షులు కృష్ణగౌడ్, పోచయ్య, ఆంజనేయులు, ఆటోడ్రైవర్లు లక్ష్మారెడ్డి, ప్రవీన్‌కుమార్, ఫరీఫ్, యాదయ్య, నగేశ్, నరసింహారెడ్డి, రమేశ్, ప్రదీప్ పాల్గొన్నారు.


హత్నూర : దౌల్తాబాద్‌లో ధర్నాలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు


తూప్రాన్‌లో నినాదాలు చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

### ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

**-ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్**

తూప్రాన్, డిసెంబర్ 21 : మహాలక్ష్మి పథకం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టిందని ఆటో యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తుప్రాన్ పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ఆటోలను నిలిపివేసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏర్పుల బాల్‌రాజ్ మాట్లాడుతూ చాలా మంది ఆటో డ్రైవర్లు ఆటో నడుపుకుంటూ జీవనం గడుపుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆటోడ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. నిరసనలో మండల ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.